




# పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికారులకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: ఈ నెల 27న మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కోసం నియమించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 26న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో సామగ్రి పంపిణీ కేంద్రానికి చేరుకోవాలన్నారు. సకాలంలో రిపోర్టు చేసి పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సామగ్రి, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సులను పరిశీలించి కేటాయించిన ప్రకారం ఉన్నవాటి వివరాలు సరిచూసి తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో పోలింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, ఉద్యోగులు ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, అదనపు ప్రిసైడింగ్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

### సెల్ టవర్ల ఏర్పాటుకు కృషి చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అటవీ అధికారి సుశాంత్‌తో కలిసి భారత్ సంచార్ నిగం లిమిటెడ్ టవర్ల నిర్మాణాలపై రెవెన్యూ, అటవీ, బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో టవర్ల నిర్మాణం, పెండింగ్ ఉన్న టవర్లపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇక్కడ తహసీల్దార్లు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన ఉండాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: ప్రతి ఒక్కరూ ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషితో కలిసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహించనున్న ఆర్థిక అక్షరాస్యత ఉత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలు గృహ బడ్జెట్, సూక్ష్మ పొదుపు, శ్రామిక మహిళలు నెలవారీ పొదుపు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత ఉత్సవాల సంబంధిత గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఇక్కడ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, బ్యాంకు ఉద్యోగులు, మహిళా ఉద్యోగులున్నారు.

# కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ

దండేపల్లి, ఫిబ్రవరి 24 : రాష్ట్రస్థాయి కుంగ్‌ఫు కరాటే పోటీల్లో దండేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. మందమర్రిలో జరిగిన మంకీఫిస్ట్ కుంగ్‌ఫులో బాలికలు ప్రతిభ చాటి బహుమతులు గెలుచుకున్నారు. 16 ఏళ్ల విభాగంలో ప్రథమ స్థానంలో మానస, సిరిచందన, అక్షయ, 14 ఏళ్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిక్షిత, సహస్ర, అక్షిత, అనూష బహుమతులు గెలుచుకున్నారు. వీరిని మాస్టర్ బచ్చల అంజన్న, ప్రిన్సిపాల్ రామగిరి రమేశ్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

# మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

వాంకిడి, ఫిబ్రవరి 24 : మహారాష్ట్రకు చెందిన ఒక యువకుడు సోమవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం, మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా, జీవితి తాలుకా, హెరెవా గ్రామానికి చెందిన హొడెబె సుదాం (33)కు భార్య సావిత్రిబాయితోపాటు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేసే సుదాం పత్తి తీసే సమయంలో వాంకిడి మండల ప్రాంతంలోనే కుటుంబంతో కలిసి వచ్చి కూలీ పనులకు వెళ్లేవాడు. కాగా, కొంత కాలంగా మద్యానికి బానిసై కూలీకి వెళ్లి వచ్చిన డబ్బులను మద్యానికే ఖర్చు చేసేవాడు. ఆదివారం భార్యతో కలిసి అత్తగారిల్లు అయిన హిరాపూర్ వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సుదాం వాంకిడి మండల కేంద్రానికి వచ్చాడు. స్థానిక ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు. కొనుగోలు చేసి అర్లీ గ్రామ శివారులోని ఓ పత్తి చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్పృహ తప్పి పడిపోయి ఉన్న సుదాంను గమనించిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. సుదాం అన్న హొడెబె సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రాత్రి 12 దాకా షాపులకు అనుమతించాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24: మార్చి 2 నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభవుతుందని పట్టణంలోని షాపులు రాత్రి 12 గంటల వరకు అనుమతించాలని కాగజ్‌నగర్ పట్టణ ఏఐఎంఐఎం పార్టీ పట్టణాధ్యక్షుడు ముబీన్ అన్నారు. ఈమేరకు సోమవారం పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సాయంత్రం ఇఫ్తార్ సమయం 5 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వాహన తనిఖీలు నిలుపాలని కోరారు. మసీదుల ప్రాంతంలో నిత్యం శుభ్రం చేయాలని, పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ కార్యదర్శి ఆబిద్ ఖాద్రి, నాయకులు అఫ్జల్, శేక్ అస్గర్, అమర్, సయీద్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా ?

- ఎన్నికలపై ఉన్న ధ్యాస.. ప్రజా సంక్షేమంపై లేదు
- ఇరుకు వంతెనలపై ప్రమాదాల నివారణకు చర్యలేవి ?
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- రోడ్డు ప్రమాద మృతుల కుటుంబసభ్యులతో రాస్తారోకో



ఈస్గం శివ మల్లన్న ఆలయం సమీపంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీఆర్ఎస్ నాయకులు

కాగజ్ నగర్, ఫిబ్రవరి 24: కాంగ్రెస్ పార్టీకి ప్రజల ప్రాణాలంటే పట్టింపు లేదని, వారికి ప్రజల సంక్షేమం కంటే ఎమ్మెల్సీ ఎన్నికలే ముఖ్యంగా ఉన్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన పిల్లల కుటుంబసభ్యులతో కలిసి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గం శివమల్లన్న ఆలయం సమీపంలోని ఇరుకు వంతెన వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇరుకైన వంతెనతో ఇక్కడ నెలకు రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయని, పలువురు మృతి చెందిన సంఘటనలున్నాయని తెలిపారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్సీ, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కనీసం రేడియం బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అందవెల్లి బ్రిడ్జి, సిర్పూర్ రెల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. కేవలం రూ. 3 నుంచి 4 కోట్లు కేటాయిస్తే, రెండు బ్రిడ్జిలను వెడల్పు చేయవచ్చన్నారు. రూ.2.5 లక్షల కోట్ల బడ్జెట్‌లో సిర్పూర్ ప్రజలకు కనీసం రూ.10 కోట్లు కేటాయించలేరా ? అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రొసీడింగ్స్ తీసుకొస్తున్నారు కానీ పనులెందుకు చేయడం లేదని నిలదీశారు. కోనప్ప లాంటి వారంతా బిల్లులు తీసుకొని పనులు పూర్తి చేయడం మరిచారని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యే ఇతర ప్రాంతాల సమస్యల మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇరుకైన వంతెన వద్ద ప్రమాదాల్లో మృతి చెందిన పిల్లల తల్లిదండ్రుల బాధను ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు.. ఇప్పటికైనా నెల రోజుల్లో ఇరుకైన వంతెనలను వెడల్పు చేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలని, నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని పట్టించుకోని సీఎం

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో 8 మంది ప్రమాదంలో ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని ఆయన విమర్శించారు. మరో పక్క రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అమెరికాలో ఎంజాయ్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి లెక్క లేకుండా ఉన్నదని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాస్పల్లి, ఈస్గం గ్రామస్తులు, కాగజ్‌నగర్ మండల ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఏరియా జీఎం బాధ్యతలు



గోలేటి జీఎం కార్యాలయంలో నూతన జీఎం విజయభాస్కర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఏరియా అధికారులు

రెబ్బెన, ఫిబ్రవరి 24: బెల్లంపల్లి ఏరియాకు నూతన జీఎంగా బదిలీపై వచ్చిన విజయ భాస్కర్ రెడ్డి బెల్లంపల్లి ఏరియా జీఎంగా సోమవారం గోలేటి జీఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. గోలేటి జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియాలోని ఉన్నతాధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఖైర్‌గూడ ఓసీపీ పీవో మచ్చగిరి నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అధికారులున్నారు. కాగా ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగ్గయ్య, జూపాక రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దివాకర్, రాజయ్య, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఎంబటి రామయ్య, కోడం అశోక్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ హీరాలాల్, శివకృష్ణ, షిఫ్ట్ ఇన్‌చార్జి తుంగల వెంకటేశ్, పుట్ట అంజయ్య, అసిస్టెంట్ సెక్రటరీ ఓదెలు, వివిధ కమిటీల సభ్యులు సత్యనారాయణగౌడ్, గోపాల్, సుధీర్, అఫ్రిది, తిరుపతి, మంతెన వేణు, అదాం సమీ సన్మానించారు.

# చెన్నూర్‌లో వాటర్ ప్లాంట్ల బంద్

## మున్సిపాలిటీ కమిషనర్ తీరుపై నిర్వాహకుల నిరసన



చెన్నూర్‌లో మూసి ఉంచిన వాటర్ ప్లాంట్

చెన్నూర్, ఫిబ్రవరి 24: చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ నిబంధనల పేరుతో వేధిస్తున్నారంటూ పట్టణంలో వాటర్ ప్లాంట్లను మూసివేసి యజమానులు సోమవారం సమ్మెకు దిగారు. చెన్నూర్‌లోని పలు వాడల్లో దాదాపు 20 మినరల్ వాటర్ ప్లాంట్ల ద్వారా ఇండ్లు, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లకు నీటి సరఫరా అవుతున్నది. ఇటీవల ఐఎస్‌వో సర్టిఫికెట్ ఉంటేనే వాటర్ ప్లాంట్లను నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ వాటర్ ప్లాంట్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. రాష్ట్రం మొత్తం మూడు వాటర్ ప్లాంట్లకే ఐఎస్‌వో సర్టిఫికెట్లు ఉన్నాయని, ఎక్కడా లేని నిబంధనలు చెన్నూర్‌లోనే విధిస్తున్నారంటూ ప్లాంట్ల యజమానులు నిరసనకు దిగారు. ఐఎస్‌వో సర్టిఫికెట్ కావాలంటే రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంత స్థోమత తమ వద్ద లేదని అందుకే ప్లాంట్లను మూసివేసినట్లు తెలిపారు. తెలిపారు. ఇటీవల పట్టణంలో డయేరియా ప్రబలటంతో బతుకమ్మ వాగు నుంచి నీటి సరఫరాను నిలిపి వేశారు. మిషన్ భగీరథ వాటర్ కూడా సక్రమంగా సరఫరా కావడం లేదు. ఇప్పుడు వాటర్ ప్లాంట్లు మూసివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంచిర్యాల జిల్లా అధికారులు, ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి స్పందించి సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# విజయవంతం చేయాలి

మందమర్రి, ఫిబ్రవరి 24 : నాగార్జునసాగర్‌లో 27, 28 తేదీల్లో నిర్వహించే దండోరా మహాసభలను విజయవంతం చేయాలని మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) పట్టణ ఇన్‌చార్జి కన్వీనర్ కొలుగూరి విజయ్‌కుమార్, కన్వీనర్లు సుద్దాల జనార్దన్, బత్తుల సరిత పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్‌లో నాయకులతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. మాదిగల హక్కులు సాధన, చర్మకారుల సమస్యల పరిష్కారం కోసం ఎంహెచ్‌డీ జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ, దళిత రత్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చలి భీమయ్య, ముసునూరి రామకృష్ణ, చంద్రశేఖర్, బుంగ ప్రకాశ్, బొడ్డు వినోద, కాంపెల్లి లక్ష్మి, కన్నూరి కృష్ణ, కొంకటి రవి, బాబు, మల్లంపల్లి మల్లయ్య, చింతల రాజు, పోగుల రాజేశ్, చందు, రాజు, వాసాల సుజాత తదితరులు పాల్గొన్నారు.